ఆటోవాలా.. డీలా!

- ఎన్నికల హామీ నెరవేర్చని కూటమి ప్రభుత్వం
- ఏడాదికి రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్
- గతంలో ఏడాదికి రూ.10 వేలు ఇచ్చిన వైఎస్ జగన్

గుడిబండ: ఆటో డ్రైవర్ల పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తరచూ పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతుండటంతో తిప్పలు తప్పడం లేదు. ప్రస్తుతం లీటర్ డీజిల్ ధర రూ.99, పెట్రోల్ రూ.110 వరకూ ఉంది. దీంతో ఆటోలను నమ్ముకుని జీవనం కొనసాగిస్తున్న కార్మికులు బెంబేలెత్తిపోతున్నారు. మడకశిర నియోజకవర్గంలోని గుడిబండ మండలంలో 70 ఆటోలు, అమరాపురం 65, అగళి 55, రొళ్ల 45, మడకశిర 105, మడకశిర రూరల్‌లో 60 ఆటోలున్నాయి. బస్సులు లేనప్పుడు ప్రయాణికులు ఆటోలపైనే ఆధారపడి గమ్యస్థానాలకు చేరుతున్నారు. ముఖ్యంగా ఆర్టీసీ బస్సులు లేని గ్రామీణ ప్రాంతాలకు ఆటోలే ఆధారం.

తగ్గిన ఆదాయం.. పెరిగిన ఖర్చులు

ఆటో నిర్వహణకు సాధారణంగా ఖర్చులుంటాయి. ప్రస్తుతం పెరుగుతున్న డీజిల్, పెట్రోల్ ధరలతో ఆటో కార్మికుడికి రోజంతా కష్టపడితే రూ.200 నుంచి రూ.300 కూడా మిగలని పరిస్థితి నెలకొంది. ఏటా ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్, సర్టిఫికెట్ల కోసం దాదాపు రూ.15 వేల దాకా ఖర్చవుతుంది. వీటితో పాటు తనిఖీల పేరుతో పోలీసులు, రవాణా శాఖాధికారులు దాడులు చేసి రూ.వేల జరిమానా విధించడం, ఆటో కొనుగోలు కోసం తీసుకున్న రుణాలకు నెలవారీ కంతులను కట్టుకోలేక ఆటో కార్మికుల బతుకులు దినదిన గండంగా మారిపోయాయి. వచ్చే అరకొర డబ్బు ఇంధనం, ఇతర ఖర్చులకే పోతున్నాయని వాపోతున్నారు.

ఆటో కార్మికులపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం

కష్టాల్లో ఉన్న ఆటో కార్మికులకు ఆదుకునే విషయంలో చంద్రబాబు ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆటోకార్మికులు విమర్శిస్తున్నారు. ఆటో కార్మికులకు ఏడాదికి రూ.15 వేలు చొప్పున ఇస్తామని, ప్రత్యేకంగా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని ఎన్నికల్లో చంద్రబాబు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి 10 నెలలు గడుస్తున్నా హామీ అమలు చేయడం లేదని మండిపడుతున్నారు.



గుడిబండ బస్టాండ్‌లో ప్రయాణికులు లేక ఖాళీగా చెట్ల నీడలో ఉన్న ఆటోలు

జగన్ ప్రభుత్వంలో భరోసా

ఎన్నికల హామీ మేరకు గతంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర బడ్జెట్‌లో ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం ఏటా బడ్జెట్ కేటాయించి అర్హులైన ఆటో, టాక్సీ, మాక్సీక్యాబ్ డ్రైవర్లకు ఏడాదికి రూ. 10 వేలు చొప్పున వారి ఖాతాల్లో జమచేసి ఆదుకున్నారు. దీంతో పాటు వాహన డ్రైవర్ ప్రమాదవశాత్తు మృతి చెందితే వారి కుటుంబ సభ్యులకు రూ. 10 లక్షల బీమా వర్తింపజేశారు. అలాగే రవాణా వాహన కొనుగోలుకు బ్యాంకు నుంచి రుణాలు తీసుకునే డ్రైవర్లకు రూ. 3 లక్షల వరకు వడ్డీరాయితీ అందించారు.

హామీ నెరవేర్చిన జగన్

ఇప్పటివరకు ఎన్ని ప్రభుత్వాలు మారినా ఆటోడ్రైవర్లను గుర్తించిన నాయకుడు ఎవరూ లేరు. ఎన్నికల ముందు పాదయాత్రలో మా సమస్యలు గుర్తించి అధికారంలోకి రాగానే ఆటోడ్రైవర్లను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి మాకు ఏడాదికి రూ. 10 వేలు అందించి ఆదుకున్నారు.

– రఘు, ఆటోడ్రైవర్, గుడిబండ

రూ.15 వేలు ఇవ్వాల్సిందే..



రోజంతా కష్టపడి ఆటో తోలినా కుటుంబ పోషణ కష్టంగా మారింది. నిత్యావసర సరుకులతోపాటు ఇంధన ధరలు పెరిగిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అప్పు చేసి ఆటో కొనుగోలు చేసి వాటి ఫైనాన్స్, పెరిగిన బీమా ప్రీమియం, రోడ్డు ట్యాక్స్‌లు కట్టుకోలేక ఆటోలను నడపలేకపోతున్నాం. ఎన్నికల హామీ మేరకు ప్రభుత్వం ఆటో కార్మికులకు రూ15 వేలు చొప్పున ఇవ్వాలి.

– దినేష్, క్యాబ్ డ్రైవర్ గుడిబండ

కుటుంబ పోషణ భారం



15 ఏళ్లుగా ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాం. డీజిల్ ధరలు ఆకాశాన్ని అంటుతున్న తరుణంలో కుటుంబ పోషణ భారంగా మారింది. దీనికి తోడు గతంలో మాదిరి ప్రస్తుతం ఆటోలకు అంతగా గిరాకీ ఉండడంలేదు. ఇలాంటి పరిస్థితి నుంచి ఆటోడ్రైవర్లకు ఆర్థికంగా సాయం చేయాలి. మమ్మల్ని ప్రభుత్వమే ఆదుకోవాలి.

– మంజునాథ్, ఆటో డ్రైవర్, అగళి మండలం.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్

గోరంట్ల: పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్తలు ఖాన్ సోదరుల తండ్రి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఇబ్రహీం ఖాన్ అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆ పార్టీ సత్యసాయి జిల్లా అధ్యక్షురాలు, పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ గోరంట్లకు చేరుకుని మృతదేహానికి నివాలర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ మేదర శంకర, మండల కన్వీనర్ వీరనారాయణరెడ్డి పాల్గొన్నారు.

పరామర్శ



నరసింహారెడ్డిని పరామర్శిస్తున్న గోవర్ధన్‌రెడ్డి

రొళ్ల: రోడ్డు ప్రమాదంలో గాయపడి తుమకూరు ఆసుపత్రికిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ రొళ్ల మండల కన్వీనర్ నరసింహారెడ్డిని గురువారం ప్రముఖ న్యాయవాది, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి తదితరులు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు నరసింహారెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే హెచ్‌టీ హళ్లిరి చెందిన సినీ దర్శకుడు ధనరాజ్ కూడా నరసింహారెడ్డిని పరామర్శించారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

హిందూపురం టౌన్: వక్ఫ్ సవరణ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం ఉపసంహకరించుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ కాలనీలో సీపీఐ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శి వినోద్ కుమార్ మాట్లాడుతూ.. పట్టణంలో శుక్రవారం వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా జరిగే ర్యాలీలో సీపీఐ శ్రేణులు భాగస్వామ్యం అవుతున్నట్లు తెలిపారు. అలాగే ఈ చట్టంపై సుప్రీంకోర్టులో చాలెంజింగ్ కేసు వేసినట్టు పేర్కొన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు మారుతి రెడ్డి, సమీవుల్లా, నౌషాద్, ఇమ్రాన్ ఖాన్, హరుణ్, ముస్తఫా, సద్దాం పాల్గొన్నారు.

తపాలా బీమాతో భరోసా



బాధిత కుటుంబానికి చెక్కును అందిస్తున్న దృశ్యం

అమరాపురం: తపాలా బీమాతో కుటుంబాలకు భరోసా లభిస్తుందని హిందూపురం గ్రామీణ తపాలా బీమా మేనేజర్ మురళీ, మడకశిర పోస్టల్ అధికారి జిలాన్ బాషా పేర్కొన్నారు. బుధవారం స్థానిక గ్రామ సచివాలయం ఆవరణలో సబ్ పోస్ట్ మాస్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో తపాల బీమాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఏటా రూ.550 ప్రీమియం చెల్లిస్తే రూ.10 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. పూర్తి వైకల్యం చెందితే కొంత మొత్తాన్ని అందిస్తామన్నారు. అనంతరం అమరాపురంలోని కోట వీధిలో ఆరు నెలల క్రితం పాము కాటుతో మృతి చెందిన మడివాళప్ప భార్య సాకమ్మకు రూ.10 లక్షల చెక్కును అందజేశారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

మడకశిర: తమ సమస్యలు తీర్చాలని కోరుతూ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్(ఎన్ఎంయూఏ) ఆధ్వర్యంలో గురువారం స్థానిక డిపో ఎదుట ఉద్యోగులు ప్లకార్డులతో నిరసన తెలియజేశారు. అక్రమ సస్పెన్షన్లు ఎత్తేయాలని, ఉద్యోగుల అక్రమ తొలగింపులు ఆపాలన్నారు. పదోన్నతులు, బదిలీలను పారదర్శకంగా చేపట్టాలని డిమాండ్ చేశారు. నాయకులు రామక్రిష్ణ, జయసింహ, పురుషోత్తం, ముద్దప్ప, అజ్మతుల్లా, బేగ్ పాల్గొన్నారు.

పెనుకొండ: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో గురువారం ఆర్టీసీ కార్మికులు ప్ల కార్డులతో నిరసన తెలిపారు. గత నెల మార్చిలో ఇచ్చిన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. ఎన్ఎంయూఏ నాయకులు, పుట్టపర్తి డిపో అధ్యక్షుడు, సెక్రటరీ నాగరాజు, రామకృష్ణ, లతీఫుల్లా సరోజమ్మ పాల్గొన్నారు.

కంప్యూటర్, కుర్చీల వితరణ

గోరంట్ల: భవిత చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నాసిన్‌లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీధర్ స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాలకు గురువారం ఒక కంప్యూటర్‌తో పాటు 16 కుర్చీలు, మూడు గ్రీన్ బోర్డులు వితరణ చేశారు. ప్రధానోపాధ్యాయురాలు మాధవీలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తకూ వైఎస్సార్‌సీపీ అండ

పెనుకొండ రూరల్: ప్రతి కార్యకర్తకూ వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీ చరణ్ అన్నారు. గురువారం సాయంత్రం నగర పంచాయతీ పరిధిలోని, పరమేశ్వరపురం, వెంకటాపురం తండాలో కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రతి గడపకూ తిరుగుతూ కార్యకర్తలను పలకరించారు. కూటమి ప్రభుత్వం అందజేస్తున్న పథకాలు, ప్రభుత్వ పనితీరు గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు మాట్లాడుతూ ప్రతి కార్యకర్తకూ వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందన్నారు. ప్రజలు, కార్యకర్తల కష్టాలను చూసి వెనుతిరిగే రకం కాదన్నారు. కష్టాలు వైఎస్సార్‌సీపీకి కొత్తకాదని గుర్తు చేశారు. క్షేత్రస్థాయిలో కార్యకర్తలు బలోపేతం అవ్వాలన్నారు. రానున్న రోజుల్లో రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పొగాకు రామచంద్ర, పట్టణ, మండల కన్వీనర్లు బోయ నరసింహులు, సుధాకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సునీల్, శ్రీకాంత్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, పిట్టా బాబు, కౌన్సిలర్లు సద్దాం, యాసిన్, శేషాద్రి, నాయకులు గణప్ప, కిష్టా తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తలతో కలసి కాఫీ తాగుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్

సమస్యలు పరిష్కరించాలని నిరసన

హిందూపురం టౌన్: తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ కార్మికులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఇందిరా పార్కు వద్ద నుంచి మున్సిపల్ కార్మికులు గడ్డి తింటూ ర్యాలీ చేపట్టారు. మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని నిరసన తెలిపారు. కూటమి ప్రభుత్వాన్ని నమ్ముకుంటే కూడు కూడా కరువైందంటూ, నాడు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు సిద్ధమంటూ నినాదాలు చేశారు. మున్సిపల్ కమిషనర్ చాంబర్ ముందు ధర్నా నిర్వహించి, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ శోభన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆప్కాస్‌లో పని చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలన్నారు. జీఓ నంబర్ 36 ప్రకారం ఇంజినీరింగ్ కార్మికులందరికీ రూ.21 వేలు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ పట్టణ కమిటీ నాయకులు జగదీష్, మల్లికార్జున, అనంద్, రామచంద్ర, నారాయణ, బాలాజీ, చంద్ర, బాబయ్య, మూర్తి, శంకర, కవితమ్మ, శోభమ్మ, ఓబులమ్మ, కార్మికులు పాల్గొన్నారు.



మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ శోభన్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

గ్రామసభను అడ్డుకున్న గ్రామస్తులు

పావగడ: వెంకటాపురం గ్రామ పంచాయతీ ఆవరణలో జరగాల్సిన గ్రామ సభ ను గ్రామస్తులు అడ్డుకున్న సంఘటన గురువారం చోటు చేసుకుంది. ఈ సందర్భంగా మాజీ గ్రామ పంచాయతీ అధ్యక్షుడు వెంకటరమణప్ప మాట్లాడుతూ స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో అవినీతి అక్రమాలకు పాల్పడిన పీడీఓ హనుమరాజు గ్రామసభకు హాజరు కాకపోవడంతో గ్రామసభను రద్దు చేశామని తెలిపారు. అతడు గ్రామసభకు వచ్చేంత వరకు గ్రామ సభలను అడ్డుకుంటామని తెగేసి చెప్పారు. అతని హయాంలో నరేగా పనుల్లో రూ 1.75 కోట్ల సొమ్మును దుర్వినియోగం చేశాడని ఆరోపించారు. వెంకటాపురం క్రాస్ లోని తాతయ్య గుడి అభివృద్ధి పనుల నిధులను మింగేశాడన్నారు. దివ్యాంగులకు ఇవ్వాల్సిన ట్రై సైకిల్స్‌ను ఇంత వరకు ఇవ్వలేదన్నారు. ఈ సందర్భంగా స్థానిక పీడీఓ మహ్మద్ రఫీక్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అధ్యక్షుడు వెంకటరమణప్ప, ఉపాధ్యక్షురాలు వరలక్ష్మమ్మ మినహా మిగతా సభ్యులు గ్రామసభకు రాకపోవడంతో గ్రామసభ రద్దయిందని, స్థానిక టీపీ ఈఓ జానకి రాం ఆదేశాల మేరకు త్వరలో గ్రామసభ నిర్వహిస్తామన్నారు.



గ్రామసభ వేదిక వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

కార్యకర్తలు సంయమనం పాటించాలి

చిలమత్తూరు: హిందూపురం పట్టణంలోని సబ్ జైలులో రిమాండ్‌లో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు వాల్మీకి లోకేష్, అంబేడ్కర్ నగర్ నవీన్, సూరి, శివను పార్టీ నియోజకవర్గ నేత వేణురెడ్డి గురువారం పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైస్ జగన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన టీడీపీ కార్యకర్త మోహన్‌పై దాడి చేశారన్న కారణంతో వీరిని పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. అనంతరం ఆయన జైలు బయట విలేకరులతో మాట్లాడారు. టీడీపీ నేతలు కావాలనే తమ అధినేతను దూషిస్తున్నారన్నారు. ఉద్వేగంలో మందిలిస్తే కేసులు పెట్టి పోలీసులతో వేధిస్తున్నారన్నారు. ఇకపై వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు సంయమనం పాటించాలని సూచించారు. టీడీపీ నేతలు చేస్తున్న, చేసే అవినీతిపై పోరాటాలు చేసి వారి మెడలు వంచుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కురుబ వర్కింగ్ ప్రెసిడెంట్ శివ, కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ అసీఫుల్లా, జిల్లా కార్యదర్శి తిప్పేరుద్రయ్య, నేతలు మాజీ రూరల్ మండల కన్వీనర్ శ్రీరామిరెడ్డి, ధనుంజయ రెడ్డి, మింటూ, కొటిపి శ్రీనివాసరెడ్డి, ఫరూక్, అబ్రహం, నవీన్, రామాంజి, హరి, రవి రాజ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వేణురెడ్డి

చిలమత్తూరు: లేపాక్షి మండలం మానెంపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ప్రకాష్ బుధవారం ప్రమాదవశాత్తూ గాయపడటంతో హిందూపురం పట్టణంలోని రాఘవేంద్ర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నేత వేణురెడ్డి గురువారం ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

‘మార్కులే జీవితం కాదు’



మాట్లాడుతున్న కౌన్సిలర్ రామకృష్ణ

హిందూపురం టౌన్: ‘పరీక్షల్లో 100 మార్కులు, టాపర్ ర్యాంకులు, ప్రతిష్టాత్మక విద్యాసంస్థల ప్రవేశాలు ఇవే ప్రస్తుతం విద్యార్థుల జీవిత లక్ష్యాలుగా మారిపోయాయి. అయితే పరీక్షలు, మార్కులే జీవితం కాదు. మానవీయ విలువల పాఠాలు కూడా అంతే ముఖ్యం’ అని వ్యక్తిత్వ వికాస నిపుణుడు, మెంటల్ హెల్త్ కౌన్సిలర్ రామకృష్ణ అన్నారు. గురువారం పట్టణంలోని కేజీబీవీలో 10వ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థినులకు పరీక్షలు.. మార్కులే జీవితమా అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్ఎస్‌సీ ఫలితాలు జీవితంలో ఒక్క మెట్టు మాత్రమే అన్నారు. ఫలితాలు జీవితాన్ని నిర్ణయించలేవని.. ఫెయిల్ అయినంత మాత్రనా ప్రపంచం ఆగిపోదన్నారు. ఎంతో మంది ప్రముఖులు తమ విద్యారంగంలో మొదటి ప్రయత్నాల్లో విఫలమయ్యారని గుర్తు చేశారు. కానీ పట్టుదలతో తిరిగి నిలబడ్డారన్నారు. కార్యక్రమంలో హిందూపురం, చిలమత్తూరు, లేపాక్షి, పరిగి మండలాల విద్యార్థులు పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

మడకశిరరూరల్: గుండుమల కస్తూర్బా పాఠశాలలో గురువారం సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్, మెంటల్ హెల్త్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కౌన్సిలర్ రామకృష్ణ మాట్లాడుతూ టెన్త్ ఫలితాలు ఎలాగున్నా వాటిని విద్యార్థినులు స్వీకరించడానికి సిద్ధం కావాలన్నారు. విజయం పొందిన వారిని చూసి ఓటమి పొందిన వారు ఆందోళన చెందకుండా ధైర్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతిభకు వైకల్యం అడ్డుకారాదు

పరిగి: ప్రతిభకు అంగవైకల్యం అడ్డుకాదని ఎంఈఓ శేషాచలం అన్నారు. గురువారం మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో విద్యార్థులకు ఉపకరణాలకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో అందరూ సమానులేనన్నారు. ప్రతిభ ఆధారంగా గుర్తింపు సంపాదించాలన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు వీల్ చైర్స్, సీపీ చైర్స్, ఎంఆర్ కిట్స్ అందించారు. ఉర్దూ పాఠశాల హెచ్‌ఎం బాబా ఫక్రోద్దీన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



మంజునాథ్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సమన్వయకర్త ఈరలక్కప్ప

అగళి: మధూడి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత వీరభద్రప్ప కుమారుడు మంజునాథ్ (26) బైక్‌పై నుంచి పడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆపార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప గ్రామానికి చేరుకుని మంజునాథ్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ శివకుమారు, వైస్ ఎంపీపీ విమ్మల సదానంద ఆరాధ్య, నాయకులు చంద్రప్ప, సూర్యనారాయణ రెడ్డి, శీనప్ప పాల్గొన్నారు.

ముస్లింల నిరసన ర్యాలీకి వైఎస్సార్‌సీపీ మద్దతు

- పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక



చిలమత్తూరు: వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా శుక్రవారం హిందూపురం పట్టణంలో ముస్లింలు చేపట్టనున్న నిరసన కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ మద్దతు ఇస్తున్నట్టు పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ చట్టం చేసి ముస్లింలకు తీరని అన్యాయం చేస్తోందన్నారు. అందుకే మాజీ సీఎం ముస్లింల పక్షాన నిలబడ్డారన్నారు. పార్టీలకు అతీతంగా వారి హక్కులకు మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

వృద్ధాప్య ఆరోగ్య అంచనా శిబిరాలు



వృద్ధులకు దంత పరీక్షలు చేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: పట్టణంలోని మేళాపురంలో ఉన్న రూపశ్రీ వృద్ధాశ్రమం, బాలాజీ నగర్‌లోని వెంకటేశ్వర సీనియర్ సిటిజన్స్ హోమ్‌లో జిల్లా ప్రభుత్వాస్పత్రి, శ్రీనివాస నగర్ యూపీహెచ్‌సీ డిప్యూటెడ్ స్పెషలిస్ట్ వైద్యుల బృందం ఆధ్వర్యంలో గురువారం సమగ్ర వృద్ధాప్య ఆరోగ్య అంచనా శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని జిల్లా వైద్యారోగ్యశాధికారిణి ఫైరోజా బేగం, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి పర్యశీలించారు. వృద్ధాశ్రమాల్లోని మొత్తం 50 మందికి బీపీ, హెచ్‌బీ, ఆర్‌బీఎస్, ఈసీజీ స్క్రీనింగ్‌తో పాటు నేత్రాలు, ఆర్థోపెడిక్, దంతాలు, గైనకాలజీ, జనరల్ మెడిసిన్, సైకియాట్రీ, ఈఎన్‌టీ, ఫిజియోథెరఫీ విభాగాల్లో పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందజేశారు. ఐడీఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ విజయ్‌బాబు మాట్లాడుతూ.. వరల్డ్ ఓరల్ హెల్త్ మంత్‌లో భాగంగా స్క్రీనింగ్ చేసి అవసరమైన వారందరికీ ఉచిత దంతాల కోసం జిల్లా ప్రభుత్వాస్పత్రికి రావాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు అనురాధ, నవీన్, నీరజ, మంజునాథ్, జీవన, ప్రశాంత్, గంగరత్న, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఓటరుగా నమోదు చేసుకోండి

పెనుకొండ రూరల్: అర్హులైన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆర్డీవో ఆనంద్ కుమార్ సూచించారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీలతో ఎన్నికల అధికారులు సమావేశం ఏర్పాటు చేశారు. ఓటరు జాబితాలోని పలు అంశాలపై నాయకులతో చర్చించారు. మార్పులు, చేర్పులు, తొలగింపు ప్రక్రియను ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

‘పాఠశాలలపై చర్యలు తీసుకోండి’

పెనుకొండ రూరల్: నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, విద్యార్థి సంఘం నాయకులు ఆర్డీఓ ఆనంద్ కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నాయకుడు హర్షకుమార్ మాట్లాడుతూ డివిజన్ వ్యాప్తంగా పలు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలో ముందస్తుగానే అడ్మిషన్ చేసుకుంటున్నారన్నారు. అలాగే అధిక ఫీజులు వసూలు చేసే పాఠశాలలపై నిఘా పెంచాలన్నారు.

ఈ-కేవైసీ చేయించకుంటే రేషన్ రద్దు

లేపాక్షి: ప్రభుత్వ చౌక ధాన్యపు డిపోల్లో రేషన్ కార్డులు కలిగిన వినియోగదారులు ఈ-కేవైసీ చేయించుకోవాలి. ఈ-కేవైసీ చేయించుకోని వారికి రేషన్ రద్దు చేయడం జరుగుతుందని సీఎస్‌డీటీ రామమోహన్ నాయక్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ఎఫ్‌పీ షాపు నం-14లో ఎండీయూ వాహనం ద్వారా జరుగుతున్న బియ్యం పంపిణీని పర్యవేక్షించారు. ఎండీయూ వాహనాల్లో బియ్యం సరఫరా చేయని వారి జీతాలు కట్ చేయడం జరుగుతుందన్నారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు

అమరాపురం: స్థానిక శిరా రోడ్డులోని ఇందిరమ్మ కాలనీలో సమీపంలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు.. ఇందిరమ్మ కాలనీకి చెందిన ఈరలింగప్ప, శివన్న బైక్‌పై బస్టాండుకు బయలుదేరారు. వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. ఈరలింగప్ప పరిస్థితి విషమించడంతో వెంటనే ప్రైవేటు వాహనంలో తుమకూరు ఆసుపత్రికి తరలించారు. శివన్నను ఆటోలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చారు. ప్రథమ చికిత్స అనంతరం కుటుంబసభ్యులు అతడిని హిందూపురం ఆసుపత్రికి తరలించారు.

‘ఆప్కాస్’ను రద్దు చేయండి

పెనుకొండ: మున్సిపల్ కార్మికుల జీవితాలను ఇబ్బందుల పాలు చేయనున్న ఆప్కాస్‌ను రద్దు యాలని సీఐటీయూ నాయకుడు బాబావలి, పారిశుధ్య కార్మికులు నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ను కోరారు. ఈ మేరకు గురువారం చైర్మన్‌కు విన్నతిపత్రం అందజేశారు. ఆప్కాస్‌ను రద్దు చేసి, ప్రైవేట్ ఏజెన్సీలకు మున్సిపల్ కార్మికులను అప్పగించరాదని, కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు వెంకటేష్, చంద్ర, నరసింహ, సుదర్శన్, మణి, మహబూబ్‌భాష తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

మడకశిర: ఏపీఆర్‌జేసీ, పాలీసెట్ ఆర్టీటీ ప్రవేశ పరీక్షలకు శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులకు గురువారం యూటీఎఫ్ నాయకులు, సాయిబాబా భక్తులు రూ.20,600 విలువ చేసే స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. యూటీఎఫ్ నాయకులు భూతన్న, లక్ష్మీనారాయణ, మాలింగప్ప, జోగప్ప, సాయిబాబా భక్తులు పాల్గొన్నారు.